www.freegurukul.org
Disclaimer: we collected these articles from Internet part of Social Awareness Campaign, we are thankful to the creators. We use for non-profit, free education purpose only. To know more, please visit: www.freegurukul.org

వెలుగు లైఫ్
బుధవారం
08. 08.05.2019
www.v6velugu.com

కౌన్సెలింగ్



# ఇలా ఉంటే.. ఇద్దరికీ మంచిది

'మా బాస్‌కు నేనంటే చాలా ఇష్టం' అంటాడు ఓ ఉద్యోగి. అదే బాస్ గురించి మరో ఉద్యోగి 'ఎప్పుడూ హింసిస్తుంటాడు' అని విమర్శించొచ్చు. 'ఎంతపని చెప్పినా ఎలాంటి టెన్షన్ లేకుండా చేస్తాడు' అని ఒక ఉద్యోగిని బాస్ మెచ్చుకోవచ్చు. అదే ఉద్యోగి ఆఫీసు నుంచి బయటకొచ్చాక 'బాస్‌కు నేనంటే అసలు పడదు. ఎప్పుడూ పనంతా నా మీదే వేస్తాడు' అని తిట్టుకోవచ్చు.

కొందరు బాస్‌లు ఉద్యోగులతో క్లోజ్‌గా ఉండొచ్చు. మరికొందరు చండశాసనుల్లా ఉండొచ్చు. ఇంకొందరు ఫ్రెండ్లీగా ఉంటూనే. ఉద్యోగుల నుంచి మంచి అవుట్‌పుట్ తీసుకోవచ్చు. అయితే.. బాస్ ఉద్యోగుల సంబంధం సరిగా లేకుంటే ఆ ప్రభావం చేసే పని మీద, సంస్థ అవుట్‌పుట్ మీద ప్రభావం చూపుతుంది.

**రాజీ వద్దు**

చాలా సంస్థలు బాస్, ఉద్యోగుల మధ్య స్నేహ సంబంధం ఉండాలని చెప్తుంటాయి. అది అన్నిసార్లు కుదరకపోవచ్చు. అలాగే అందరు బాస్‌లు, ఉద్యోగులతో స్నేహంగా ఉండకపోవచ్చు. అలాగని శత్రువులుగా కూడా ఉండరు. ఉద్యోగుల నుంచి పనిని రాబట్టుకోవడమే ప్రధాన లక్ష్యంగా వ్యవహరిస్తుంటారు. అయితే ఆ వ్యవహరించే విధానంలో తప్పనిసరిగా స్నేహపూరిత వాతావరణం ఉండాలి. కానీ, బాస్ ఉద్యోగులతో స్నేహంగా ఉండటం వల్ల కొందరు ఉద్యోగులు ఆ చనువుతో పని సరిగా చేయకపోవచ్చు. సన్నిహితంగా ఉండే బాస్ పని విషయంలో కోప్పడినా, గట్టిగా చెప్పినా.. అది వాళ్ల వ్యక్తిగత బంధంపై పడుతుంది. దాంతో మానసికంగా బాధపడాల్సి వస్తుంది. అందుకే బాస్ ఉద్యోగులతో ఎంత మంచిగా ఉన్నా పని విషయంలో రాజీ పడకూడదు. అలాగే ఉద్యోగులు కూడా బాస్‌తో ఉన్న స్నేహాన్ని అతిగా వాడుకోకుండా, మంచితనాన్ని గుర్తిస్తూనే, పనిపై పూర్తి దృష్టిపెట్టాలి. అందుకే బాస్ ఎంప్లాయీస్ మధ్య ఉండే స్నేహానికి పరిమితులు వర్తిస్తాయి అంటారు కౌన్సెలర్లు.

**హైక్ రాలేదని**

ఉద్యోగుల జీవితంపై ఎక్కువ ప్రభావం చూపేవి పదోన్నతులు, శాలరీ హైక్‌లు. ఇవి ఎక్కువగా బాస్ మీద ఆధారపడి ఉంటాయి. ఈ విషయంలో బాస్ నిజాయితీగా వ్యవహరించాలి. ఉద్యోగుల్లో ఎవరు ఎక్కువ కష్టపడుతున్నారు? ఎవరు మాటలతో పబ్బం గడుపుతున్నారు? ఎవరి టాలెంట్ ఎంత? .. వంటివి గుర్తించి ప్రవర్తించాలి. అలాగే ఉద్యోగులు కూడా తమ శక్తి వంచన లేకుండా పని చేస్తూ పదోన్నతిని, శాలరీ పెంపును కోరుకోవాలి. కానీ 'కేవలం నాకు జీతం పెరగలేదు. నాకు ప్రమోషన్ రాలేదు' అని బాస్‌ను విమర్శించడం వల్ల ప్రయోజనం ఉండదు. హోదా, జీతం పెరగడం ఉద్యోగికి మంచి గుర్తింపు. అలాగే అవి సరైన వ్యక్తికి అందేలా చూడడం బాస్ బాధ్యత. అప్పుడే ఉద్యోగులకు బాస్‌పై నమ్మకం, గౌరవం పెరుగుతాయి. బాస్‌లో నిజాయితీని ఉద్యోగులూ గుర్తిస్తారు.

**అత్యుత్సాహం వద్దు**

ఉద్యోగంలో చేరిన కొత్తలో కొందరు ఉద్యోగులు అత్యుత్సాహం చూపుతారు. ఎక్కువ పని చేయడానికి, బాస్ దృష్టిలో పడటానికి ప్రయత్నిస్తారు. దాంతో ఒత్తిడి, అసహనానికి గురైనా మొదట్లో తట్టుకుంటారు. కానీ క్రమంగా బాస్, వాళ్లలోని టాలెంట్ గుర్తించి బాధ్యతలు అప్పజెప్తే, ఒత్తిడిని తట్టుకోలేరు. మొదట చేసినంత ఉత్సాహంగా పనిచేయలేరు. అందుకే అత్యుత్సాహంతో శక్తికి మించిన పనిని మోయడం ఉద్యోగికి మంచిది కాదు. బాస్‌ను మెప్పించే క్రమంలో తమను తాము కోల్పోకూడదు. చేయలేని పనిని నెత్తికెత్తుకోవడం కంటే, తెలిసిన పని చేస్తూ, కొత్త పనిని నేర్చుకుంటూ ముందుకెళ్లడం ఉద్యోగికి శ్రేయస్కరం. ప్రతి ఉద్యోగిలో ఉన్న టాలెంట్‌ను గమనించి, వాళ్లు సంస్థకు ఎలా ఉపయోగపడతారో తెలుసుకుని.. పనిని రాబట్టుకోవాలి. ఆ క్రమంలోనే బాస్‌కు, ఉద్యోగులకు మధ్య మంచి బంధాలు ఏర్పడతాయి. వ్యక్తిగత లక్ష్యాలకోసం బాస్‌లు ఉద్యోగులను ఇబ్బంది పెట్టకూడదు. అలాగే ఉద్యోగులు కూడా అనవసరమైన పుకార్లు పుట్టించి, బాస్‌లకు చెడ్డపేరు తీసుకురాకూడదు.

**సమస్యలు తెలుసుకోవాలి**

మీటింగ్‌లో పనిమీద ఎంత చర్చ జరగాలో, ఉద్యోగులు ఆఫీసులో ఎదుర్కొంటున్న బాధలు, సంతోషాలపై కూడా అంతే చర్చ జరగాలి. అప్పుడే ఉద్యోగులు బాస్‌కు బాగా దగ్గరవుతారు. టార్గెట్‌లు ఇచ్చి పనిచేయించేటప్పుడు, ఆ పని చేయడంలో ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను మీటింగులలో తెలుసుకుని పరిష్కరించాల్సిన బాధ్యత పై వాళ్లకు ఉంటుంది. కొందరు ఉద్యోగులు మీటింగులో అందరి ముందు మాట్లాడటానికి ఇష్టపడకపోవచ్చు. కొందరు ఎక్కువగా మాట్లాడొచ్చు. కానీ బాస్ అందరినీ దృష్టిలో పెట్టుకుని నిర్ణయాలు తీసుకోవాలి. అలాగే ఎవరు ఏ స్థాయిలో పనులు చేస్తున్నారో గమనించి మీటింగులో ప్రోత్సహించాలి. ఒక మీటింగ్ జరిగింది అంటే దాని వల్ల తప్పనిసరిగా ప్రతిఫలం ఉండాలి.

**వాదన వద్దు**

బాస్‌తో వాదనకు దిగడం వల్ల ఉద్యోగులకు ఎలాంటి ఫలితం ఉండదు. తప్పు ఉద్యోగులు చేసినా, బాస్ చేసినా ఇద్దరూ అర్థం చేసుకుని పని మీద దృష్టి పెట్టాలి. అంతేకానీ, 'నాది కరెక్టు' అంటే. 'నాదే కరెక్టు' అంటూ ఇద్దరూ వాదనకు దిగకూడదు. ఉద్యోగులు తప్పు చేయొచ్చు. ఒక్కోసారి బాస్ కూడా సరిగా వ్యవహరించకపోవచ్చు. కానీ వాదన వల్ల ఇద్దరి మధ్య ఉన్న బంధం దెబ్బతింటుంది. అది అప్పుడు చేసే పని మీదే కాదు, తర్వాత పనులు మీద కూడా ప్రభావం చూపుతుంది. కొత్త బాధ్యతలు తీసుకోవాల్సి వచ్చినప్పుడు ఉద్యోగి, అప్పజెప్పాల్సినప్పుడు బాస్ కూడా వాదనవల్ల వెనకాడొచ్చు. వాదనను మిగిలిన ఉద్యోగులు విన్నా, తర్వాత తెలిసినా.. దాన్ని వాళ్లకు అనుకూలంగా మార్చుకొని ఇద్దరి మధ్య విభేదాలు సృష్టించవచ్చు.



## పార్టీలు

పలు సంస్థలు ఉద్యోగులకు పార్టీలు ఇవ్వడం ఈ మధ్య ఎక్కువగానే కనిపిస్తోంది. అయితే ఆ పార్టీలో పెద్దస్థాయి బాస్‌ల నుంచి చిన్న స్థాయి ఉద్యోగుల వరకు ఉంటారు. అయితే అక్కడ కూడా ఆఫీసులోలా వ్యవహరించాలనేం ఉండదు. కానీ, కొందరు ఉద్యోగులు, బాస్‌లు అక్కడ కూడా తమ మధ్య ఉన్న అంతరాన్ని అలాగే ఉంచుతారు. బాస్‌లు ఉద్యోగులను దూరంగా పెట్టొచ్చు, ఉద్యోగులు కూడా బాస్‌ల మీద ఉన్న గౌరవం, కోపం.. లాంటి స్వభావాల వల్ల కలవకుండా దూరంగా ఉండిపోవచ్చు. కానీ పార్టీలు ఉద్యోగుల మధ్య బంధాలు పెంచడానికి, ఉత్సాహం నింపడానికి సంస్థలు ఏర్పాటు చేస్తాయి. కొందరు దర్పానికి పోయి, లోపల ఎంజాయ్ చేయాలని ఉన్నా, బాస్‌కు భయపడతారు. అలాగే బాస్‌లు కూడా తెల్లారి ఆఫీసులో ఉద్యోగులు ఏమనుకుంటారో అని లోపలున్న ఆలోచనలను బయటపెట్టరు. హుందాగా ఉన్నట్లు నటిస్తారు. అలా కాకుండా మామూలుగా ఉండాలి.

## పని ముఖ్యం

ఆఫీసులో ఉద్యోగులు, బాస్‌లు ఒకేవిధమైన మూడ్‌లో ఉంటారని చెప్పలేం. కానీ ఎలా ఉన్నా పని మాత్రం చేయాల్సిందే. వ్యక్తిగత మూడ్ ఎలా ఉన్నా, పని మీద చూపించకూడదు. మూడ్ బాగోలేదని పని చేయకుండా సమయం వృథా చేయకూడదు. అలా చేయడం వల్ల ఆఫీసు వాతావరణం దెబ్బతింటుంది. బాస్, ఉద్యోగులు ఎలాంటి మూడ్‌లో ఉన్నా అవి ఆఫీసు వాతావరణం, పనుల మీద పడకుండా జాగ్రత్త తీసుకోవాలి. లేదంటే ఇద్దరి మధ్య ఉన్న రిలేషన్ దెబ్బతింటుంది. మిగిలిన ఉద్యోగులకు చులకనై పోతారు.



www.freegurukul.org
Disclaimer: we collected these articles from Internet part of Social Awareness Campaign, we are thankful to the creators. We use for non-profit, free education purpose only. To know more, please visit: www.freegurukul.org